క్లుప్తంగా

చిలుకూరు తహసీల్దార్‌గా సరిత బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్ సరిత

చిలుకూరు : చిలుకూరు మండలం నూతన తహసీల్దార్‌గా వి.సరిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నేరేడుచర్ల నుంచి ఆమె బదిలీపై చిలుకూరుకు వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆమెకు ఘన స్వాగతం పలికారు.

నేరేడుచర్ల తహసీల్దార్‌గా సురగి సైదులు


తహసీల్దార్ సైదులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల నూతన తహసీల్దార్‌గా సురగి సైదులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన సరిత చిలుకూరుకు బదిలీపై వెళ్లారు. పెద్దవూరలో పనిచేస్తున్న సురగి సైదులు ఆమె స్థానంలో ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సైదులు మాట్లాడుతూ ప్రజలు, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

బీజేపీ రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ రేపు హుజూర్‌నగర్‌కు రాక

హుజూర్‌నగర్ : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ అరవింద్ మీనన్ ఆదివారం హుజూర్‌నగర్ రానున్నట్లు ఆ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గట్టు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి హాజరవుతారని తెలిపారు. నియోజవర్గంలోని అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా పదాధికారులు, మోర్చా నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

త్రిపురవరం ఎంపీటీసీ రాజీనామా

అనంతగిరి : మండలంలోని త్రిపురవరం గ్రామ బీఆర్‌ఎస్ ఎంపీటీసీ కొత్తా జానకినారాయణరెడ్డి శుక్రవారం తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈమేరకు రాజీనామా లేఖను అనంతగిరి ఎంపీపీకి, కోదాడ ఎమ్మెల్యేకు పంపినట్లు ఆమె తెలిపారు. బీసీ కులవృత్తుల పేదలకు రుణాల పంపిణీ విషయంలో నేతలు తన మాట వినలేదని ఆమె అసంతృప్తితో పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు.

కష్టపడి చదవాలి


విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న బీవీఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు

నడిగూడెం : కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని బుర్రా వెంకటరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుర్రా సుధారాణి పుల్లారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో బీవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాగులు పంపిణీ చేసి మాట్లాడారు. నేటి విద్యార్థులు ముందు తరాలను ఆదర్శంగా తీసుకొని చదవాలన్నారు. కార్యక్రమంలో బీవీఆర్ ఫౌండేషన్ సభ్యులు బుర్రా ప్రమోద్, బుర్రా గోవిందరెడ్డి, నడిగూడెం సహకార సంఘం చైర్మన్ పుట్టా రమేష్, ప్రధానోపాధ్యాయులు సామినేని శ్రీనివాసరావు, కనకమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'నా మట్టి.. నా దేశం'


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న బీజేపీ నాయకులు

కోదాడఅర్బన్ : ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో కోదాడ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, త్రివేణి కళాశాలల్లో విద్యార్థులతో నా మట్టి- నా దేశం ప్రతిజ్ఞ చేయించారు. కోదాడ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కనగాల నారాయణ, అడిషనల్ కోఆర్డినేటర్ బొలిశెట్టి కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు నూనె సులోచన, నాయకులు వంగవీటి శ్రీనివాసరావు, కారుమంచి రామకోటి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి స్కూటర్ బహూకరణ

భానుపురి : వాసవి ఎన్నారై క్లబ్ ఆధ్వర్యంలో పలువురు దాతలు శుక్రవారం దివ్యాంగుడైన వల్లభోజు వెంకటేశ్వర్లుకు జిల్లా కేంద్రంలో రూ.1,20,000 విలువ చేసే స్కూటర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో దాతలు స్వామి కమలాకర్ గంగాభవాని, వాసవి ఎన్నారై క్లబ్ అధ్యక్షుడు పసుపర్తి కృష్ణమూర్తి, గుండా ఉపేందర్, వీర్లపాటి రమేష్, మిర్యాల వెంకటేశ్వర్లు, బోలగాని భిక్షపతి, అంజలి స్కూల్ పూర్వ విద్యార్థులు వెంకటేష్, నారాయణ విశాల్, శ్రీనివాస్, జ్యోతి, రవి పాల్గొన్నారు.

చకచకా గ్రంథాలయ నిర్మాణం

- పూర్తికావొచ్చిన మొదటి అంతస్తు నిర్మాణ పనులు
- ప్రభుత్వం, ఉద్యోగులు, గ్రామస్తుల సహకారంతో అభివృద్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు


చిలుకూరులో నిర్మిస్తున్న నూతన గ్రంథాలయ భవనం

చిలుకూరు : ఘన చరిత్ర కలిగిన చిలుకూరు బాపూజీ శాఖా గ్రంథాలయ నూతన భవన నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ నిధులతో పాటు చిలుకూరు గ్రామస్తులు, గ్రామంలోని ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థిక సహాయంతో నిర్మాణం జరుగుతోంది. ఇప్పటికే స్థానిక జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు నిధులు జిల్లా పరిషత్ నుంచి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో గ్రంథాలయం భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ సహకారంతో కోదాడ మండల పరిధిలోని ఫోరస్ ల్యాబ్ వారు రూ.25 లక్షలతో ఆగిపోయిన భవన నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నారు. దాదాపుగా మొదటి అంతస్తు భవనం పనులు పూర్తి కావొచ్చాయి.

జిల్లా గ్రంథాలయ సంస్థ నుంచి రూ.20 లక్షలు

ఇటీవల జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానిమియా తన నిధుల నుంచి భవన నిర్మాణానికి రూ.2 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో పనులు చేస్తున్నారు. అలాగే గ్రంథాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, హైదరాబాద్‌లో పోలీసు ఉద్యోగం చేస్తున్న గ్రామానికి చెందిన పలువురు రాష్ట్ర గ్రంథాలయం సంస్థ అధికారులను, ప్రజాప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలిసి చిలుకూరు గ్రంథాలయం చరిత్రను తెలియజేశారు. దీంతో వారు జిల్లా గ్రంథాలయం సంస్థ నుంచి రూ.20 లక్షల నిధులను మంజూరు చేసినట్లు శుక్రవారం వారు తెలిపారు. దీంతో గ్రంథాలయం అభివృద్ధి కమిటీ హర్షం వ్యక్తం చేశారు. అంతేగాక మండల పరిషత్ నుంచి మరో రూ.5 లక్షలు మంజూరు చేస్తామని ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య ప్రకటించారు. ఈ నిధులతో భవనం రెండో అంతస్తు నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పనులు మరో వారం రోజుల్లో ప్రారంభంకానున్నాయి. అలాగే నారాయణపురంనకు చెందిన ఆల్ట్రా పెయింట్స్ ఎండీ సైదిరెడ్డి రంగులు అందజేశారు.

అందరి సహకారంతో నిర్మిస్తున్నాం



చిలుకూరులో గ్రంథాలయ నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్, గ్రామ పెద్దలు, ఫోరస్ ల్యాబ్, ప్రజాప్రతినిధులు, గ్రంథాలయ అభివృద్ధి, కమిటీ ప్రభుత్వ ఉద్యోగుల సహకారంతో నిర్మాణం జరుగుతోంది. గ్రంథాలయాన్ని ముున్ముందు డిజిటల్ లైబ్రరీగా మార్చడానికి కృషిచేస్తాం.

– అంజాల వెంకటి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్

ఎస్సీ వర్గీకరణ సాధనకు సిద్ధం కావాలి


చిలుకూరులో మాట్లాడుతున్న ఏపూరి రాజు

చిలుకూరు : ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సాధనకు మాదిగ జాతి సిద్ధం కావాలని ఎమ్మెస్పీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏపూరి రాజు మాదిగ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధనకు ఈ నెల 17వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించబోయే జిల్లా స్థాయి సదస్సుకు మందకృష్ణ మాదిగ వస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై కేంద్రం ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ సాధించేంత వరకు ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి కోటేష్, మండల ఇన్‌చార్జ్ మల్లెపంగు సూరి, నాయకులు సిద్దెల శ్రీను, కందుకూరి ఎల్లయ్య, గుండెపంగు సాయికుమార్, ముదిగొండ వీరస్వామి, సుధాకర్, రామారావు, చిరంజీవి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు మరిచిన కేసీఆర్



కోదాడలో రాస్తారోకో చేస్తున్న రెండవ ఏఎన్‌ఎంలు, ఏఐటీయూసీ నాయకులు

కోదాడఅర్బన్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ మరిచారని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. తమ ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేయాలని శుక్రవారం కోదాడలోని రాజీవ్ చౌరస్తాలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రెండవ ఏఎన్‌ఎంలు రాస్తారోకో చేసి మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాగానే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ అనే పదమే ఉండదని చెప్పిన సీఎం నేటికీ ఆ వాగ్దానం నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో రెండవ ఏఎన్‌ఎంలు విధులు బహిష్కరించి ఎనిమిది రోజులుగా నిరసన తెలుపుతున్నా సీఎంకు చలనం కలగడం లేదన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చేపూరి కొండలు, ఏఎన్‌ఎం నాయకురాళ్లు రాధ, అనిత, సరిత, రూప, గోపమ్మ, నిర్మల, పద్మ, నరసమ్మ, నీరజ, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు శ్రీకాంత్‌రెడ్డి పరామర్శ


కుక్కడపు రాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గట్టు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు

గరిడేపల్లి : మండలంలోని తాళ్లమల్కాపురం గ్రామానికి చెందిన బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కుక్కడపు వెంకటేశ్వర్లు తండ్రి కుక్కడపు రాములు అనారోగ్యంతో మృతి చెందారు. బీజేపీ రాష్ట్ర నేత డాక్టర్ గట్టు శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి, సోషల్ మీడియా అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ సతీష్, రామినేని కృష్ణయ్య, చిత్తలూరి సోమయ్య, ముసుకుల చంద్రాకరెడ్డి, కుందూరు కోటిరెడ్డి, ఆనంద్, మంద వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

హుజూర్‌నగర్ : పట్టణంలో ఇటీవల మృతి చెందిన కోడి మల్లయ్యయాదవ్ కుటుంబ సభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి, నాయకులు ఎం.చంద్రారెడ్డి, జి.సతీష్, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల అరెస్టు

నడిగూడెం : రెండో ఏఎన్‌ఎంల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా నిరసన చేస్తున్న వారికి మద్దతు తెలిపిన సీపీఎం నాయకులను శుక్రవారం నడిగూడెం పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. ఆయన వెంట మల్లెల వెంకన్న తదితరులు ఉన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మునగాల : మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం మండల కేంద్రానికి చెందిన పెనుయేలు వర్షిప్ సెంటర్స్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు జె.సామ్యూల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్

హుజూర్‌నగర్ : క్రీడలు మానసిక శారీరక ఉల్లాసానికి దోహదపడతాయని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని న్యాయ స్థానంలో నిర్వహిస్తున్న ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నేహభావంతో క్రీడలు ఆడాలి తప్ప శత్రుత్వ భావాన్ని పెంచుకోవద్దన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా క్రీడలు నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్, క్రీడల నిర్వాహకులు కాల్వ శ్రీనివాసరావు, మద్దుల నాగేశ్వరరావు, ఎంఎస్ రాఘవరావు, కుక్కడపు నరసింహారావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


పోలీస్ కళాజాతాలో మాట్లాడుతున్న ఎస్‌ఐ హరికృష్ణ

హుజూర్‌నగర్ : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ హరికృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షీ టీమ్, పోలీస్ కళాబృందం సైబర్ నేరాలు, మహిళలు, పిల్లల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 కాల్, సోషల్ మీడియా, ఓటీపీ ఫ్రాడ్, సైబర్ నేరాలు, భరోసా సెంటర్, టోల్‌ఫ్రీ నెంబర్ 1930, సెల్ ఫోన్‌తో అనర్థాల గురించి ఆట, పాటల ద్వారా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీటీం ఏఎస్‌ఐ పాండునాయక్, షీటీం హెడ్ కానిస్టేబుల్ జాఫర్, ఏఎస్‌ఐలు లింగారెడ్డి, రమేష్, సిబ్బంది నాగరాజు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, పోలీస్ కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, కృష్ణ, గురులింగం విద్యార్థులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి

కోదాడఅర్బన్ : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం (రేపు) నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీఎస్‌సీపీఎస్ఐయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగల సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు విధిగా హాజరు కావాలని కోరారు. మధ్యాహ్నం 3 గంటలకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో జరిగే బహిరంగ సభకు దేశంలోని అన్ని రాష్ట్రాల సీపీఎస్ సంఘం నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు.

పాఠశాల వజ్రోత్సవాల సన్నాహక సమావేశం


వజ్రోత్సవాల లోగో నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న పూర్వ విద్యార్థులు

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థాపించి 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు వజ్రోత్సవాలు నిర్వహించేందుకు శుక్రవారం పాఠశాలలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వజ్రోత్సవాల లోగో నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ వజ్రోత్సవాల నిర్వహణ తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వజ్రోత్సవ నిర్వాహణ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గన్నా లింగయ్య, అలుగుబెల్లి లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులు బిల్లా కనకయ్య, సుందరి నాగయ్య, కోశాధికారి నక్క మట్టయ్య, మున్సిపల్ సూర్యాపేట మాజీ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, ఎంపీటీసీలు వెంకటరమణ, రాం మల్లమ్మసైదులు, కర్లం లక్ష్మి, రామకృష్ణ, మాజీ సర్పంచ్ భిక్షం, చంద్రారెడ్డి, వీరయ్య, సత్యం, లక్ష్మీనర్సయ్య, అంజి, వీరభాస్కర్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

అందుబాటులో జాతీయ జెండాలు


మునగాలలోని ఓ ప్రైవేటు పాఠశాలలో జాతీయ జెండాలు ప్రదర్శిస్తున్న పోస్టల్ సిబ్బంది

మునగాల : తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాలు అందుబాటులో ఉన్నాయని మునగాల సబ్ పోస్టుమాస్టర్ జ్ఞానేశ్వరి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని న్యూప్రజ్ఞ పాఠశాలలో ఆమె తమ సిబ్బందితో కలిసి జాతీయ జెండాలు ప్రదర్శించి మాట్లాడారు. జాతీయ జెండాలు కావాల్సిన వారు స్థానిక పోస్టాఫీస్‌లలో కొనుగోలు చేయవచ్చన్నారు. ఆన్‌లైన్ ద్వారా పోస్టల్ శాఖ వెబ్‌సైట్‌లో కూడా ఆర్డర్ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బీపీఎంలు మోతీలాల్, రామనర్సయ్య, ఏబీపీఎంలు నాగార్జునపు బ్రహ్మచారి, దివ్య పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి

ఆత్మకూరు (ఎస్) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న డాక్టర్, నర్సు పోస్టులను భర్తీ చేయాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నల్గొండ నాగయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆ సంఘం ఆధ్వర్యంలో సందర్శించి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రగతిశీల యువజన సంఘం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సర్వే నిర్వహిస్తోందని తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే కాలం కాబట్టి పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేదంటే డీఎంహెచ్‌ఓ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వీరబోయిన రమేష్, కోశాధికారి బండి రవి, దడిగెల లింగయ్య, కొమ్ము దేవలింగం తదితరులు పాల్గొన్నారు.

సమీకృత మార్కెట్ పరిశీలన

సూర్యాపేట : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సమీకృత వెజ్ నాన్ వెజ్ మార్కెట్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి శుక్రవారం రాత్రి పరిశీలించారు. రూ.30 కోట్ల నిధులతో ఈ సమీకృత మార్కెట్ భవనం పనులు పూర్తయి, ప్రారంభానికి సిద్ధంగా ఉండడంతో మార్కెట్‌ను మంత్రి జగదీష్ రెడ్డి పరిశీలించారు. మార్కెట్ మొత్తం సమీకృత భవనం లోపలే ఉండడంతో సరుకుల కొనుగోలుకు వచ్చే ప్రజల సౌకర్యార్థం భవనం నలువైపులా సెంట్రల్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. మార్కెట్లో ఏర్పాటు చేసే టేబుల్స్ నాణ్యతను పరిశీలించారు. మార్కెట్ ప్రారంభోత్సవం నాటికి సెంట్రల్ కూలింగ్ సిస్టం పనులు పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ వెంకట్రావు, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ రామానుజల రెడ్డి, అధికారులు తదితరులు ఉన్నారు.

గరిడేపల్లి మండలంలో వర్షం

గరిడేపల్లి : మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. దీంతో గత కొద్ది రోజులుగా వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతన్నలు సంతోషం వ్యక్తం చేశారు. గారకుంటతండా, పరెడ్డిగూడెం, గానుగుబండ, వెంకట్రాంపురం, కల్మలచెరువు గ్రామాల్లో దాదాపు రెండు గంటల పాటు వర్షం కురిసింది.

ఆటో డ్రైవర్‌కు గాయాలు

మునగాల: జాతీయ రహదారిపై మునగాల మండల కేంద్రం శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ గాయపడ్డాడు. చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన ఆటో కోదాడ నుంచి మునగాల వైపు వస్తోంది. ఈ క్రమంలో వెనుక నుంచి డీసీఎం వేగంగా ఢీకొట్టడంతో ఆటో ఎగిరి రహదారి పక్కన పడిపోయింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఆటోలో ప్రయాణికులు ఎవరూ లేరు. ఆటో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీఈసీ మాత్రల పంపిణీ


మునగాల మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు డీఈసీ మాత్రలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

మునగాల : మండలంలో శుక్రవారం బోధకాలు వ్యాధి నివారణ (డీఈసీ) మాత్రలు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఏఎన్‌ఎం సుజాత, హెల్త్ అసిస్టెంట్ సురేష్, ఆశావర్కర్లు అనిత, వాణి, వనజ, లక్ష్మిలు విద్యార్థినులకు మాత్రలు వేశారు. రేపాల, మునగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 15 రోజుల పాటు డీఈసీ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఆయా కేంద్రాల వైద్యాధికారులు వినయ్‌కుమార్, పి.రవీందర్ తదితరులు తెలిపారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి


కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

నేరేడుచర్ల : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని స్పందన జూనియర్ కళాశాల కరస్పాండెంట్ కట్టా ప్రవీణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాల ఆవరణలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వై.వెంకట్‌రెడ్డి, అధ్యాపకులు శ్రీధర్, సతీష్, ఆంజనేయులు, శ్రీనివాసాచారి, లింగారెడ్డి, నరేష్ ఉన్నారు.

చేతిపంపు బాగు చేయరూ..


కరివిరాల క్రాస్ రోడ్డు వద్ద నిరుపయోగంగా ఉన్న చేతిపంపు

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాల క్రాస్ రోడ్డు వద్ద గల చేతి పంపు గత ఏడాదిగా నిరుపయోగంగా ఉంది. ఈ క్రాస్ రోడ్డు నుంచి నిత్యం కాగితరామచంద్రాపురం, నడిగూడెం మండల కేంద్రానికి అనేక మంది వెళ్తుంటారు. దాహం అయితే ఈ చేతి పంపు నీటినే తాగుతారు. కానీ గత ఏడాదిగా చేతి పంపు పనిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చేతి పంపునకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పోకల లింగయ్యకు నివాళి

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు తండ్రి పోకల లింగయ్య దశదిన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు లింగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో సూర్యాపేట మున్సిపల్ మాజీ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, పీసీసీ సభ్యుడు దొంగరి వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డి, సీపీఐ, బీఆర్‌ఎస్, బీజేపీ, రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, నట్టి సైదయ్య, రాములు, కనకయ్య, ఆంజనేయులు, సత్యనారాయణ, నర్సింహరావు ఉన్నారు.


లింగయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పని సులభం.. దిగుబడి ఆశాజనకం

- డ్రమ్ సీడర్, వెదజల్లే పద్ధతి వైపు రైతుల మొగ్గు
- తక్కువ సమయంలో పంట
- కూలీల ఖర్చూ తక్కువే..

హుజూర్‌నగర్‌రూరల్ : వ్యవసాయంలో కాలానుగుణంగా విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. దీంతో కూలీల కొరత ఏర్పడుతోతోంది. అంతేకాకుండా పెట్టుబడులు కూడా విపరీతంగా పెరగడంతో రైతులు నూతన పద్ధతులు పాటిస్తున్నారు. నారు పోసి నాటు పెట్టే విధానానికి స్వస్తి పలికి వెదజల్లుట, డ్రమ్ సీడర్ పద్ధతులను అవలంబిస్తున్నారు. దీంతో తక్కువ సమయంలో అధిక పంట దిగుబడి పొందుతున్నారు.


బూరుగడ్డ వద్ద డ్రమ్‌సీడర్‌తో విత్తనాలు వేస్తున్న రైతులు


వేపలసింగారంలో వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన వరి

10 వేల ఎకరాల్లో..

మండల పరిధిలోని సాగర్ ఆయకట్టు బూరుగడ్డ, కరక్కాయలగూడెం, మాధవరాయినిగూడెం, వేపలసింగారం తదితర గ్రామాలతో పాటు ఆయకట్టు చివరి భూముల్లో బోర్లు, బావులు, ఎత్తిపోతల పథకాల కింద మొత్తం 10 వేల ఎకరాల్లో ప్రస్తుత వానాకాలం సీజన్ వరి సాగు చేపట్టారు. ఇప్పటివరకు వెదజల్లడం, డ్రమ్ సీడర్ పద్ధతిలో 3 వేల ఎకరాల వరకు నాట్లు వేశారు. నాటు వేసే పద్ధతిలో 4 వేల ఎకరాల్లో నాట్లు పూర్తి చేశారు.

3 ఏళ్లుగా డ్రమ్ సీడర్ పద్ధతిలోనే..



నాకున్న 8 ఎకరాల్లో 3 ఏళ్లుగా డ్రమ్ సీడర్, వెదజల్లే పద్ధతిలోనే వరి సాగు చేస్తున్నాను. ఈ విధానంలో నారుమడి యజమాన్యం ఖర్చులు, నాటు కూలీల ఖర్చులు మిగులుతున్నాయి. దిగుబడి సాధారణం కన్నా నాలుగు బస్తాల పంట అధికంగా వస్తోంది.

– సురభి నాగరాజు రైతు, బూరుగడ్డ

ఆశాజనకంగా పంట దిగుబడి



నాకున్న 13 ఎకరాల వ్యవసాయ భూమితో పాటు మరో 6 ఎకరాలు కౌలు భూమిలో గత 6 ఏళ్లుగా డ్రమ్ సీడర్ పద్ధతిలో వరిసాగు చేస్తున్నాను. ఈ విధానంలో పెట్టుబడులు చాలా తక్కువ. పంట దిగుబడి కూడా ఆశాజనకంగా వస్తోంది. మా గ్రామంలో 30 శాతం ఈ పద్ధతినే అవలంబిస్తున్నారు.

– సాముల బ్రహ్మారెడ్డి, రైతు, వేపలసింగారం

పెట్టుబడులు తగ్గుతాయి



వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేస్తే చాలావరకు పెట్టుబడులు తగ్గుతాయి. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో కూలీల కొరత ఉంది. దీంతో ఈ విధానంలో సాగు చేస్తే మేలు. అదేవిధంగా ఈ పద్ధతిని పాటించే రైతులకు సాగు నీరు ఆదా అవుతుంది. పంట దిగుబడులు కూడా ఆశాజనకంగా వస్తాయి.

– రావిరాల స్వర్ణ, ఏఓ, హుజూర్‌నగర్